క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన కె.కె.రాజు



ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల ముగింపు వేడుకలకు మంగళవారం నగరానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. - సీతమ్మధార

'గ్రీవెన్స్'కు విశేష స్పందన

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. తమ సమస్యలు విన్నవించుకున్నారు. కె.కె.రాజు వాటిని పరిశీలించి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మిగిలిన వినతులను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వాటర్ ఫౌంటెయిన్ పునరుద్ధరణ



వాకర్స్ పార్కులో వాటర్ ఫౌంటెయిన్‌ను ప్రారంభిస్తున్న చంద్రమౌళి

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో కొద్ది కాలంగా నిరుపయోగంగా పడి ఉన్న వాటర్ ఫౌంటెయిన్‌ను పునరుద్ధరించారు. దీనిని మంగళవారం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పి.చంద్రమౌళి ప్రారంభించారు. ఏనుగులతో నిర్మించిన ఈ వాటర్ ఫౌంటెయిన్‌ను క్లబ్ పూర్వ అధ్యక్షుడు చిలకపాటి కృష్ణమూర్తి సహకారంతో ఏర్పాటు చేశారు. ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో క్లబ్ సంయుక్త కార్యదర్శి చొల్లంగి ప్రసాదరావు సహకారంతో దీనికి సంబంధించిన పైప్‌లైన్లు, మోటారు పంపు, ఎలక్ట్రికల్ కనెక్షన్ల మరమ్మతులు నిర్వహించి ఫౌంటెయిన్‌ను పునరుద్ధరించారు. ఇందుకు సహకరించిన ప్రసాదరావుకు క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఫిట్జీ విద్యార్థుల ప్రతిభ



శ్రీరామ్ వెంకటకృష్ణ



సాయివెంకట కార్తీక్



కృష్ణ చైతన్య

తాటిచెట్లపాలెం: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఫిట్జీ విద్యార్థులు ప్రతిభ చూపారు. దేశవ్యాప్తంగా ఫిట్జీ నుంచి ఐదుగురు విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఫిట్జీ వైజాగ్ సెంటర్ నుంచి 678 మంది ఈ పరీక్షకు హాజరుకాగా వీరిలో 21 మంది విద్యార్థులు 99 పర్సంటైల్, 116 మంది 95 పర్సంటైల్, 203 మంది 90 పర్సంటైల్ సాధించారని చెప్పారు. శ్రీరామ్ వెంకటకృష్ణ 99.93 పర్సంటైల్‌తో ప్రథమ స్థానంలో, ఎల్.సాయివెంకట కార్తీక్ 99.93 పర్సంటైల్‌తో ద్వితీయ స్థానంలో, ఎస్.కృష్ణచైతన్య 99.71తో తృతీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపకులను సంస్థ మేనేజింగ్ పార్టనర్ పెండేల మస్తాన్‌రావు అభినందించారు.

నాడు శిథిలం.. నేడు సుందరం



అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ప్రాంతాలను ఒకేలా తీర్చిదిద్దుతున్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒకనాడు భయం గొలిపే కంచరపాలెం నేతాజీ వంతెన మార్గాన్ని అందంగా తీర్చిదిద్దారు. బీటీ రోడ్లు, రంగులు, విద్యుత్ స్తంభాలు, పూల కుండీలు ఏర్పాటు చేసి పచ్చదనం పెంపొందించారు. దీంతో నాడు అధ్వానంగా ఉన్న వంతెన.. నేడు అందంగా రూపుదిద్దుకోవడం చూసిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- నేతాజీ వంతెనకు నూతన హంగులు
- బీటీ రోడ్లు, రంగులు, విద్యుత్ స్తంభాలు, పూలకుండీల ఏర్పాటు
- జగనన్న ప్రభుత్వంలోనే సాధ్యమైందని ప్రజల హర్షం



వంతెనపై ప్రమాదభరితంగా ఫుట్‌పాత్



ఫుట్‌పాత్‌పై టైల్స్ వేస్తున్న కార్మికులు

కంచరపాలెం: కంచరపాలెం నేతాజీ వంతెన మార్గం సుందరంగా రూపుదిద్దుకోవడంతో పాదచారులు, వాహన చోదకులు సాఫీగా ప్రయాణం చేస్తున్నారు. కంచరపాలెం కూడలి నుంచి జ్ఞానాపురం రైల్వే స్టేషన్ వరకు గల రహదారులకు జీవీఎంసీ నిధులు రూ 1.55 కోట్లు మంజూరు చేసింది. రహదారి వంతెనకు మరమ్మతులు చేపట్టడమే కాకుండా వంతెన మార్గంలో బీటీ రోడ్లు, రంగులు, విద్యుత్ స్తంభాలు, పూల కుండీలు ఏర్పాటు చేయడంతో పరిసరాలు గ్రీనరీగా మారాయి. పాదచారులు నడిచేందుకు ఫుట్‌పాత్‌లపై టైల్స్ ఏర్పాటు చేసి జీబ్రా క్రాసింగ్‌తో తీర్చిదిద్దారు.

వంతెన మరమ్మతులకు ఖర్చు చేసిన నిధులు.. పనుల వివరాలు..

పనులు	నిధులు
సీసీ రోడ్లు	రూ.11.50 లక్షలు
బీటీ రోడ్లు	రూ.45.82 లక్షలు
వంతెన జాయింట్‌కు గ్రౌటింగ్	రూ.12.32 లక్షలు
ఫుట్‌పాత్‌పై సిమెంట్ పలకలు	రూ.8.21 లక్షలు
ఫుట్‌పాత్‌లకు టైల్స్	రూ.23.45 లక్షలు
విద్యుత్ స్తంభాలు, లైట్లు	రూ.12.67 లక్షలు
ఫుట్‌పాత్‌లకు రంగులు	రూ.18.5 లక్షలు
వంతెన రక్షణ గోడలకు రంగులు	రూ.22.98 లక్షలు

చిమ్మచీకట్లు తొలగేలా..

గత ప్రభుత్వంలో ఈ వంతెను పట్టించుకునే నాథులు కరువయ్యారు. కంచరపాలెం ప్రధాన కూడలి నుంచి జ్ఞానాపురం రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గాల్లో చిమ్మచీకట్లు కమ్ముకుని ఉండేవి. నేతాజీ వంతెనపై విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి నేలకొరిగాయి. స్తంభాలు ఫుట్‌పాత్‌లపై పడి పాదచారుల ప్రయాణానికి అడ్డంగా ఉండేవి. ఏళ్ల పాటు విద్యుత్ లైట్లు వెలగక అటు వాహన చోదకులు.. ఇటు పాదచారులు ఇబ్బందులు పడేవారు. సాయంత్రం అయ్యేసరికి వంతెన మార్గంలో చీకట్లు కమ్ముకోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారేది. ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళా వాకర్లు ఇబ్బందులు పడేవారు.

ప్రజాప్రతినిధుల కృషితో..

నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనందకుమార్‌లు ఎంతో కృషి చేసి నేతాజీ వంతెన అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు. జోన్–5 ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో వంతెనపై ఫుట్‌పాత్, సిమెంటు దిమ్మలు ఏర్పాటు చేస్తున్నారు. సిమెంటు పలకలు ఏర్పాటు చేసి టైల్స్ వేశారు. తుప్పుపట్టిన విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్తవి వేశారు. వాటికి లైట్లు అమర్చడంతో వంతెన వెలుగులు విరజిమ్ముతోంది. తాటిచెట్లపాలెం, మర్రిపాలెం నుంచి కంచరపాలెం మీదుగా ఎఫ్‌సీఐ, జ్ఞానాపురం రైల్వేస్టేషన్, కాన్వెంటు కూడలి వైపు ప్రయాణం చేసే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నేడు: రంగులు - విద్యుత్ స్తంభాలతో సుందరంగా కనిపిస్తున్న కంచరపాలెం నేతాజీ వంతెన

నాడు: నేతాజీ వంతెనపై కమ్ముకున్న చీకట్లు

సమస్యలకు పరిష్కారం చూపారు



నేను 15 ఏళ్ల నుంచి గొల్లకంచరపాలెంలో నివసిస్తున్నాను. గతంలో వంతెనపై సమస్యలతో వాకింగ్ చేయాలంటేనే భయంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధితో వంతెనకు మోక్షం లభించింది. వాహన చోదకులు, పాదచారులు సౌకర్యవంతంగా ప్రయాణం చేస్తున్నారు. నాడు జరగని వంతెన అభివృద్ధి.. నేడు జగనన్న పాలనలో జరగడం ఎంతో ఆనందంగా ఉంది.

– ఎం.రాజ్యం, వాకర్, గొల్ల కంచరపాలెం

అందంగా తీర్చిదిద్దారు



రోడ్లు, ఫుట్‌పాత్‌లు, విద్యుత్ దీపాలు, రంగులతో నేతాజీ వంతెన కళకళలాడుతోంది. గతంలో ఈ దారిలో వాహనాలపై వెళ్లాలంటే ఒళ్లు హూనమయ్యేది. రోడ్లకు మరమ్మతులు చేపట్టడంతో వాహన చోదకులు హాయిగా ప్రయాణిస్తున్నారు. గోతులమయంగా ఉండే వంతెన రహదారిపై గత ప్రభుత్వంలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫిర్యాదు చేస్తే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు.

– బి.శ్రీనివాసరావు, రెడ్డికంచరపాలెం

మరింత సుందరంగా నేతాజీ వంతెన



నేతాజీ వంతెనపై నెలకొన్న సమస్యలపై స్పందనలో వినతులు అందాయి. ఇంజినీరింగ్, విద్యుత్ అధికారులు సత్వరం సమస్యలు పరిష్కరించేలా ఆదేశించాం. ప్రజాప్రతి నిధుల కృషితో నిధులు త్వరగా మంజూరై గత ఏడాది అక్టోబర్‌లో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాం. విద్యుత్ స్తంభాలు, ఫుట్‌పాత్‌లపై సిమెంటు పలకలు వేసే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. వంతెనకు కొత్త హంగులద్ది పనులు పూర్తి చేస్తాం.

– ఆర్.జి.వి.కృష్ణ, జోన్–5 కమిషనర్, జీవీఎంసీ

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

నాయీ బ్రహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లారావు



కార్పొరేషన్ చైర్మన్ పుల్లారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నాయీ బ్రహ్మణ కులస్తులమంతా రుణపడి ఉంటామని నాయీ బ్రహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్ల పుల్లారావు అన్నారు. 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయనకు నాయీ బ్రహ్మణ సంఘ సభ్యులు ఆత్మీయ సత్కారం చేశారు. నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పుల్లారావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ నాయీ బ్రహ్మణ సామాజిక వర్గానికి సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యం కల్పించారన్నారు. పుల్లారావు మాట్లాడుతూ సంఘంలో రక్షణ కల్పించే విధంగా జీవో నంబర్ 50ను ప్రవేశపెట్టడంతోపాటు వైఎస్సార్ చేదోడు పథకం కింద ఆర్థిక సాయం అందజేస్తూ విద్యుత్ వినియోగంలో రాయితీ కల్పించారన్నారు. రాష్ట్రంలోని 1,100 దేవాలయాల్లో ఏర్పాటు చేసిన కమిటీల్లో నాయీ బ్రహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించిన ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. 2024లో మళ్లీ జగనన్న గెలుపే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా పర్యటించి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ వెంపటాపు నూకరాజు, సభ్యులు అతవ సుబ్బారావు, తుంపాల గణేష్, కోడూరు గణపతి, గులిమి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



కళింగనగర్‌లో రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్ రోడ్డు ఎన్నో ఏళ్ల తర్వాత అభివృద్ధికి నోచుకుంది. కొన్ని కారణాల వల్ల ఈ రహదారి పనులు జరగలేదు. ఎట్టకేలకు నిర్మాణం పనులు ప్రారంభించి సీసీ రోడ్డు వేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ నిర్మాణం జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ రోడ్డు మాధవధార కళింగనగర్ నుంచి నేరుగా హైవే పంజాబ్ హోటల్ జంక్షన్ వరకు వెళ్తుంది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంపై జీవీఎంసీ అధికారులకు కార్పొరేటర్ వెంకటరమణ పలు సూచనలిచ్చారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, కాంట్రాక్టర్ సునీల్, ఎమినిటీస్ సెక్రటరీ అలేఖ్య, టౌన్ ప్లానింగ్ సెక్రటరీ లక్ష్మణ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

25న వైశాఖి స్పోర్ట్స్ పార్క్ కమిటీ ఎన్నికలు



ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదుల చేస్తున్న అధికారి రంగారావు

మురళీనగర్: మురళీనగర్, మాధవధార పరిసరాల్లో ప్రముఖ ఉద్యానవనంగా పేరొందిన మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ నిర్వహణ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుత కమిటీ కాల పరిమితి ముగియడంతో రానున్న రెండేళ్లకు నూతన కార్యవర్గ ఎన్నికలకు సభ్యులు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి ఎం.ఆర్.కె.రంగారావు మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 16 నుంచి 18 వరకు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 11 గంటలు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నామినేషన్ పత్రాలు జారీ చేస్తారు. పూర్తి చేసిన నామినేషన్ పత్రాలు ఈ నెల 20వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్వీకరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణ 22న సాయంత్రం 3 నుంచి 6 గంటల మధ్యలో ఉంటుంది. 25వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యవర్గ ఎన్నికలు నిర్వహించి, సాయంత్రం 6 గంటలకు ఫలితాలు ప్రకటిస్తారు. కార్యవర్గ నిర్వహణ కమిటీ పదవులు, వాటికి కావాల్సిన అర్హతల వివరాలు పార్కు కార్యాలయంతోపాటు స్విమ్మింగ్ పూల్ ఆవరణలోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శించారు.

రూ.1.02 కోట్లతో అభివృద్ధి పనులు



45వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, కంపా హనోకు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు చిట్టిబాబు కాలనీ, సంతోషిమాత కాలనీ, సోనియాగాంధీ నగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు ఆధ్వర్యంలో మంగళవారం అభివృద్ధి పనులకు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతాల్లో సుమారు రూ.1.02 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, సెప్టిక్ ట్యాంక్లు వంటి పనులు చేపడుతున్నారు. అనంతరం వార్డులో కె.కె.రాజు పర్యటించి స్థానిక సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, జీవీఎంసీ ఏఈ ఉమామహేశ్వరరావు, వార్డు నాయకులు సన్నీ, నాయుడు, మాత ఈశ్వరరావు, అనంత, శ్రీను, రెడ్డి, దుర్గారావు, నరసింగరావు, శెట్టి, గ్రామ పెద్దలు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

విశాఖ విద్య: జిల్లా స్థాయి సైన్సు ఫెయిర్ ఈ నెల 15న నిర్వహించనున్నట్టు జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో గాజువాక కణితి రోడ్‌లోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వేదికగా నిర్వహిస్తున్న ప్రదర్శనకు జిల్లాలో 65 ప్రాజెక్టులు ఎంపికైనట్టు పేర్కొన్నారు.

22న 'సెయింట్ జోసెఫ్'లో జాతీయ సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ షైజీ, నిర్వాహకులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల బోటనీ విభాగం, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. ఈ మేరకు కళాశాల సెమినార్ హాల్లో మంగళవారం ఆమె బ్రోచర్ ఆవిష్కరించారు. బయోలాజికల్ సైన్సెస్‌లో ఆవిష్కరణలు–అభివృద్ధి సాంకేతికతలు అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.మాణిక్యకుమారి కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కె. జయలక్ష్మి, డాక్టర్ పద్మసుందరి, సిస్టర్ హేమ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ హరిణి, డాక్టర్ వీరబ్రహ్మం, డాక్టర్ మేరీ అనుపమ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ సుధ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా 'ఆరోగ్య సురక్ష' శిబిరాలు

మహారాణిపేట: రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం భీమిలి మండలం పొట్నూరు, పద్మనాభం మండలం రేవిడి, ఆనందపురం మండలం గంభీరం గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ శిబిరాల్లో మొత్తం 1,515 మంది రోగులు పేర్లు నమోదు చేసుకోగా.. ఉచిత వైద్య సేవలు అందించారు. అవసరమైన మందులు అందజేశారు. పలువురికి నేత్ర పరీక్షలు చేశారు. కంటి శుక్లాలను గుర్తించి ఉచితంగా ఆపరేషన్ చేసి కళ్లద్దాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఆరుగురిని మెరుగైన వైద్యం కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫరల్ చేశారు. రోగులకు డీఎంహెచ్‌వో కిట్స్ పంపిణీ చేశారు.

నేడు 12 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

నగర పరిధిలో 12 ప్రాంతాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నారు. ఆదర్శనగర్, పురుషోత్తపురం, చంద్రనగర్, న్యూగాజువాక, గిరిజా కాలనీ, బాపూజీనగర్, అంబేడ్కర్‌నగర్, ఏఎస్ఆర్ నగర్, కొబ్బరితోట, లాసన్స్‌బే కాలనీ, బక్కన్నపాలెం, బాలాజీనగర్‌లలో ఈ వైద్య శిబిరాలు జరుగుతాయని డీఎంహెచ్‌వో తెలిపారు.

ఇష్టారాజ్యంగా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు

- పాదచారులకు ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలు
- దృష్టి సారించని అధికారులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఫుట్‌పాత్‌పై నిర్వహిస్తున్న టిఫిన్ షాపు



గురుద్వారా జంక్షన్ వద్ద ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ టేబుళ్లు, సామగ్రి



నక్కవానిపాలెం రహదారిలో ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24, 25 వార్డుల్లోని ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. పాదచారుల కోసం నిర్మించిన కాలిబాటలను కొందరు ఇష్టారాజ్యంగా ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలతో ఫుట్‌పాత్‌లు నిర్మిస్తే.. వాటిపై టిఫిన్ షాపులు, మినీ హోటళ్లు, సైకిల్ షాపులు, ఫ్రిజ్‌లు, ఇతర వ్యాపార సామగ్రి ఏర్పాటు చేసి పలువురు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గురుద్వారా జంక్షన్‌లో గల హోటల్ సెల్లార్‌లో వ్యాపారాలు నిర్వహించడం వల్ల వాహనాలను రోడ్డుపైనే పార్క్‌చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అక్కడి ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు సాగిస్తుండటంతో పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని చోట్ల ఫుట్‌పాత్‌లపై వాహనాలు నిలిపివేయడంతో పాదచారులు నడిచేందుకు కష్టతరంగా మారింది. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం పక్కన, నక్కవానిపాలెంలో ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమించి విచ్చలవిడిగా వ్యాపారులు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు కిరాణా షాపులు ఏర్పాటు చేసి తమకు అనువుగా కాలిబాటలను మార్చుకుంటున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రాంనగర్‌లో లేపాక్షి ఎంపోరియం ప్రారంభం

డాబాగార్డెన్స్: రాంనగర్‌లో లేపాక్షి ఎంపోరియం రెండో షోరూం, ఆప్కో మంగళవారం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అఖిల భారత వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి కొత్త స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో విశాఖపట్నంలో లేపాక్షి రెండో షోరూం ప్రారంభించామన్నారు. ఎంపోరియం ఏర్పాటుకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున కృషి చేశారన్నారు. విశాఖ వాసులు లేపాక్షి ఎంపోరియంలో చేతి వృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులు, చీరలు, వస్త్రాలు కొనుగోలు చేసి, హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. త్వరలోనే వైఎస్సార్ జిల్లా గండికోటలో నూతన లేపాక్షి ఎంపోరియం ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ప్రతీ జిల్లా ప్రధాన కేంద్రంలో వైఎస్సార్ చేతివృత్తుల బజార్ల ఏర్పాటుకు సంబంధించిన ఫైల్‌ను సీఎంకు పంపినట్లు తెలిపారు. లేపాక్షి మేనేజర్ కార్తీక్, ఆప్కో సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో అక్షరాభ్యాసాలు నేడు

డాబాగార్డెన్స్: వసంత పంచమిని పురస్కరించుకుని బురుజుపేటలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో చిన్నారులకు బుధవారం అక్షరాభ్యాసాలు చేయించనున్నట్లు కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పాల్గొనదలిచే చిన్నారుల తల్లిదండ్రులు రూ.200 రుసుం చెల్లించాలని పేర్కొన్నారు. పూజకు కావల్సిన సామగ్రిని భక్తులే తెచ్చుకోవాలని చెప్పారు. చిన్నారులకు పలక, పెన్ను, పుస్తకాన్ని దేవస్థానమే ఉచితంగా అందజేయనుందని ఈవో వివరించారు.

'ఇన్‌స్పైర్ మనాక్'లో 200 ప్రాజెక్టుల ఎంపిక

విశాఖ విద్య: ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో 200 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒక్కో విద్యార్థి రూ.10 వేలు ప్రోత్సాహకం అందుకోనున్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను జిల్లాల వారీగా సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నగదు ప్రోత్సాహకం అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సామాజిక అంశాలే ప్రధానం: మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఏటా పాఠశాల స్థాయిలో 'ఇన్‌స్పైర్ మనాక్' పేరిట విద్యార్థుల్లో సృజనాత్మకతపై పోటీలను నిర్వహిస్తోంది. సామాజిక అంశాలు, సమాజాభివృద్ధికి దోహదపడే వినూత్నమైన ఆలోచనలకు రూపం ఇచ్చేలా ఎలాంటి ప్రాజెక్టులను తయారు చేస్తామనే అంశంపై విద్యార్థులు తమ ఐడియాను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 2023–24 విద్యా సంవత్సరానికి 2,680 మంది పేర్లు నమోదు చేసుకోగా, ఇందులో 200 మంది ఎంపికయ్యారు. విద్యార్థులు తమకు అందిన రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని వినియోగించుకుని, ప్రాజెక్టుకు అవసరమయ్యే సామగ్రిని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థుల పేర్లతో బ్యాంక్ అకౌంట్ తెరవాలని సూచించారు.